

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి

బెల్లంపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేస్తున్నామని జిల్లా క్షయనివారణ అధికారి సుధాకర్ నాయక్ అన్నారు. శుక్రవారం తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహించి మాట్లాడారు. క్షయవ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. రెండువారాలకుపైగా దగ్గు లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతీ ఆరోగ్య కేంద్రంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు



బాధ్యతలు చేపడుతున్న ఎస్‌ఐ కిరణ్‌కుమార్

బెల్లంపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతానని టూటౌన్ ఎస్‌హెచ్‌వో కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్‌ఐకి పోలీసు సిబ్బందితో పాటు పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

రైతులకు భారమే..

- పెరిగిన ఎరువుల ధరలతో ఇబ్బందులు
- రూ. వంద నుంచి రూ.300 వరకు పెంపు
- వానాకాలం సీజన్‌లో భారమైన సాగు



పద్దన్‌పల్లి పీఏసీఎస్ కార్యాలయంలో అందుబాటులో ఉన్న వివిధ రకాల ఎరువులు

మంచిర్యాల, జూలై 25(ఆంధ్రజ్యోతి) : పెరిగిన ఎరువుల ధరలతో రైతన్న కుదేలవుతున్నారు. ఇప్పటికే సాగుభారం అధికంకాగా దానికి తోడు వివిధ రకాల ఎరువుల ధరలు కూడ పెరిగాయి. ఎరువుల రకాన్ని బట్టి 100రూపాయల నుంచి గరిష్ఠంగా 300రూపాయల వరకు ధరలు పెంచారు. ఇప్పటికే వర్షాభావ పరిస్థితుల కారణంగా వానాకాలం సీజన్‌లో పంటను సాగు చేసేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. ప్రస్తుతం ఎరువుల ధరలు పెరగడం వారికి భారంగా మారింది. డీఏపీ, యూరియా మినహా మిగితా అన్ని ఎరువుల ధరలు దాదాపుగా పెరిగాయి.

● భారంగా వానాకాలం సాగు...

మంచిర్యాల జిల్లాలో వానాకాలం సాగుకింద మూడు లక్షల18వేల786 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. వాటిలో జీలుగ పంట 37,845 ఎకరాలు, వరి పంట లక్షా58వేల161ఎకరాలు, పత్తిపంట లక్షా 58వేల753 ఎకరాలు, కందులు 1,054ఎకరాలు, మొక్కజొన్న పంట 531 ఎకరాలు, పెసలు 116 ఎకరాలు, మినుములు 69ఎకరాలు, ఇతరపంటలు 250ఎకరాల్లో సాగవుతున్నాయి. వీటికి సంబంధించి ఎరువులు అవసరం ఉండగా వాటి రేట్లు పెరగడంతో రైతులు ఒకింతఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● 78,073 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం...

వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లాలో సాగైన వివిధ పంటలకు ఎరువులు వేసేందుకు మొత్తం 78,073 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉంటుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. వానాకాలం సాగుకు సంబంధించి వివిధ పంటలకు దశలవారీగా ఎరువులు వినియోగించనుండగా ఆ మేరకు ఎప్పటికప్పుడు స్టాక్ అందుబాటులో ఉంచుతున్నారు. జిల్లాలోని 20వ్యవసాయ ప్రాథమిక సంఘాలు, ప్రైవేటుడీలర్ల ద్వారా రైతులకు ఎరువులు అందుతున్నాయి. జిల్లాలోని ప్రస్తుతం వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు యూరియా, డీఏపీ ఎరువులు వినియోగిస్తున్నారు. వానాకాలం సాగుకు..

(మిగతా 7లో..)

పెరిగిన ఎరువుల ధరలు ఇలా..

ఎరువు	పాత ధర రూ.	కొత్త ధర రూ.	వ్యత్యాసం రూ.
పొటాష్	1,535	1,800	265
20-20-0-13(ఫ్యాక్ట్)	1,300	1,425	125
20-20-0-13(గ్రోమోర్)	1,300	1,350	50
20-20-.0-13(పీపీఎల్)	1,300	1,400	100
10-26-26	1,470	1,800	330
12-32-16(ఇఫ్కో)	1,470	1,720	250
16-16-16	1,450	1,600	150
14-35-14(గ్రోమోర్)	1,700	1,800	100
సింగిల్ సూపర్ ఫాస్పేట్	580	640	60

పాఠాలు చదివించి.. ప్రశ్నలు వేసి..

- కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్



నస్పూర్ కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థినితో పాఠం చదివిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రయ్య

నస్పూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని అదనపు కలెక్టర్ పి చంద్రయ్య శుక్రవారం సందర్శించారు. విద్యాలయం పరిసరాలతో పాటు తరగతి గదులు, వంటశాల, విద్యార్థులకు అందిస్తున్న మెనూ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తరగతి గదిని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. పుస్తకం తీసుకుని అందులోని పాఠాన్ని విద్యార్థులతో చదివించారు. పాఠం నుంచి కొన్నిప్రశ్నలు వేసి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. మంచిగా చదివి ఉన్నత స్థానాలకు చేరాలని, కష్టపడి చదివితేనే బంగారు భవిష్యత్ ఉంటుందని అదనపు కలెక్టర్ చంద్రయ్య విద్యార్థులకు సూచించారు. విద్యాలయం ప్రిన్సిపల్ మౌనిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే వినోద్



సీఎంతో ఎమ్మెల్యే వినోద్, కాంగ్రెస్ నాయకులు

బెల్లంపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ పాటు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు నాయకులు సీఎంను శాలువాతో సన్మానించారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే వినోద్ సీఎంను కోరారు. సీఎం సానుకూలంగా స్పందించి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

● నియోజకవర్గంలో ఎదుర్కొంటున్న సమస్యలు ఏవైన తన దృష్టికి తీసుకరావాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ నాయకులకు సూచించారు. శుక్రవారం ఎమ్మెల్యే వినోద్‌ను నియోజకవర్గ నాయకులు హైదరాబాద్‌లో కలిసి పలు సమస్యలు, అభివృద్ధి విషయాలపై చర్చించారు. అభివృద్ధి విషయంలో రాజీపడేది లేదని ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని నియోజకవర్గ నాయకులందరూ ప్రజాసమస్యలను తన దృష్టికి తీసుకరావాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సూరిబాబు, ముచ్చర్ల మల్లయ్య, కారుకూరి రాంచందర్, నాతరి స్వామి, రత్నం ప్రదీప్, బండి లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మత్స్యకారుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మత్స్యకారులు

నస్పూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మత్స్యకార సొసైటీలకు చేప పిల్లలకు బదులుగా నగదు బదిలీ చేయాలని, మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట తెలంగాణ మత్స్యకారుల, మత్స్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ చంద్రయ్యకు అందించారు. ఈ సందర్భంగా మత్స్యకారుల కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొడెంకి చందు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో 10 ఎకరాల్లో అధునాతన సౌకర్యాలతో కూడిన చేపల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. చేప పిల్లలకు బదులుగా సొసైటీలకు నగదు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో కోటి చేప, రొయ్య పిల్లలను వేయాలన్నారు. జిల్లా కేంద్రంలో మత్స్య భవన్ నిర్మించాలన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని కోరారు. చేపల వేట నిషేధిత కాలంలో ప్రతీ మత్స్యకారుడి కుటుంబానికి 20వేల రూపాయలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్న చెరువులు, కుంటలు కబ్జాకు గురికాకుండా కాపాడాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు సంకె రవి, నాయకులు ఉమారాణి, మంచేర్ల రాజేందర్, జునుగురి నారాయణ, వెంకటేశ్, మహేష్, చంద్రయ్య, ఆశన్న, రాజన్న, రమాదేవి, సరిత, తదితరులు పాల్గొన్నారు.

పైరవీలు లేకుండా సంక్షేమ పథకాలు

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

జన్నారం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ఎలాంటి పైరవీలు లేకుండా ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రగతిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ నూతనంగా మంజూరైన రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో రెండుసార్లు అధికారం దక్కించుకున్న బీఆర్ఎస్ పార్టీ పేదలకు రేషన్‌కార్డులు ఇచ్చిన దాఖలాలు లేవని అన్నారు. ఒక్క రేషన్‌కార్డు ఇవ్వకుండా పేదలను నిరుపేదలుగా మార్చారే తప్ప అభివృద్ధి చేసిందేమిలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్నమాట మేరకు ఇందిరమ్మ గృహాలతో పాటు ఒక జన్నారం మండలంలోని అర్హులైనవారికి 1800 రేషన్‌కార్డులను అందజేశామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎలాంటి పైరవీలు లేకుండా సంక్షేమ పథకాలు పేదల ప్రజలకు అందుతున్నాయన్నారు. మండలంలో ఇప్పటికే అన్ని గ్రామాల్లో మూడు కోట్ల నిధులతో సీసీ రోడ్లు నిర్మించామన్నారు.

రేషన్‌కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ:కలెక్టర్

రేషన్‌కార్డుల పంపిణీ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. రేషన్‌కార్డు దరఖాస్తు చేసుకున్న ప్రతీ లబ్ధిదారుడికి అర్హత మేరకు రేషన్‌కార్డు లభిస్తుందని అన్నారు. రేషన్‌కార్డులతో పాటు నిరుపేద కుటుంబాలకు వచ్చే సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంపీడీవో ఉమర్ షరీఫ్, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, పొన్కల్ సహకార సంఘం చైర్మన్ అల్లం రవి, కాంగ్రెస్ నాయకులు ముజాఫర్ అలీ, సయ్యద్ ఫసీయుల్లా, మేకల మాణిక్యం, గుర్రం మోహన్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, మామిడిపెల్లి ఇంధయ్య, దుమ్మల్ల రమేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

28న మినీ జాబ్ మేళా

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని టాస్క్ శిక్షణ కేంద్రంలో ఈ నెల 28న ఉదయం 10.30 గంటలకు మిని జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. హైద్రాబాద్‌లోని అపోలో ఫార్మసీలో ఖాళీగా ఉన్న పోస్టులకు జాబ్‌మేళా ఉంటుందన్నారు. పదో తరగతి, ఇంటర్, డీబీఎం ఫార్మసీ, డిగ్రీ అర్హత గల వారు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాల కోసం 8247656356, 9963452486లో సంప్రదించాలని సూచించారు.

పశువైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

కోటపల్లి/వేమనపల్లి జూలై 25 (ఆంధ్రజ్యోతి): పశువైద్యాధికారులు, సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి పశువులకు చికిత్సలు నిర్వహించాలని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ శంకర్ సూచించారు. కోటపల్లి, వేమనపల్లి మండలం నీల్వాయి. వేమనపల్లిలోని పశువైద్యశాలలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పశువైద్యశాలలోని రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయ పాలన పాటించి రైతులకు అందుబాటులో ఉండాలని ఆయన ఆదేశించారు. అలాగే వర్షాకాలంలో పశువులకు సంక్రమించే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్ గౌడ్

మందమర్రిరూరల్/నెన్నెల జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. మందమర్రి మండలం చిర్రకుంట, నెన్నెల మండలంలోని నందులపల్లిలో బూత్ అధ్యక్షులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సర్పంచు, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అధికంగాగెలిచి సత్తాచాటేందుకు కష్టపడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. అనంతరం నందులపల్లిలో బీఆర్ఎస్ వార్డు సభ్యుడు పాలగాని గోపాల్, కేశవేణి పర్వతాలు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో మందమర్రి మండల అధ్యక్షుడు జనార్ధన్, మండల ఇన్‌చార్జి దేవరనేని సంజీవరావు, నెన్నెల మండల అధ్యక్షుడు అంగిలి శేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవర్ధన్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే క్రిమినల్ కేసులు



ఎరువుల దుకాణాన్ని తనికీ చేస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

బెల్లంపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణ యజమానులు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా వ్యవసాయశాక అధికారి చత్రు నాయక్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల దుకాణాల యజమానులు డీలర్లు, ఎరువులను కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా లైసెన్స్‌లు రద్దు చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లాలోని రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని తెలిపారు. విడతలవారీగా యూరియా మండలాలకు సరఫరా అవుతుందని ఒకేసారిగా రైతులు కొనుగోలు చేయకుండా విడతలవారీగా కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ రాజ నరేందర్, ఏవో ప్రేంకుమార్, అధికారులు పాల్గొన్నారు.

తాండూర్/లక్షెట్టిపేట/భీమారం (ఆంధ్రజ్యోతి): తాండూర్, కాసిపేట, లక్షెట్టిపేట, భీమారం, మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపులను అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పతి ఎరువుల దుకాణం ముందు స్టాకు నిల్వలు, ధరల పట్టికను ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో తాండూర్ తహసీల్దార్ జ్యోత్స్న, మాదారం ఎస్‌ఐ సౌజన్య, మండల వ్యవసాయాధికారి సుష్మ, లక్షెట్టిపేల తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఎస్సై గోపతి సురేష్, ఏవో శ్రీకాంత్, భీమారం తహసీల్దార్ సదానందం, ఎస్‌ఐ శ్వేత, మండల వ్యవసాయాధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు విధులను సమర్థవంతంగా నిర్వహించాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. శుక్రవారం కలెక్టర్ సమావేశ మందిరంలో సెర్ప్ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీ ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెర్ప్ సీఈవో ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో సెర్ప్ ఏపీఎంలుగా ఎక్కువ కాలం ఒకేప్రాంతంలో పనిచేస్తున్న వారిని బదిలీ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ఏపీఎంలుగా పనిచేస్తున్న 20 మందికి వారి సీనియారిటీ ప్రకారం ఓపెన్ కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీ చేశామని వివరించారు. డీఆర్‌డీవో కిషన్, అదనపు డీఆర్‌డీవో అంజయ్య పాల్గొన్నారు.

అంటువ్యాధులు, విషజ్వరాలు ప్రబలకుండా చూడాలి

- మంత్రి సీతక్క



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్, అధికారులు

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో అంటువ్యాధులు, విష జ్వరాలు వ్యాప్తి చెందకుండా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) సూచించారు. శుక్రవారం హైద్రాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ భారీ వర్షాల దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మలేరియా, డయేరియా, టైఫాయిడ్ ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. దోమలు వృద్ధిచెందకుండా నీటినిల్వలను తొలగించాలని, ఆయిల్‌బాల్స్, బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులను చేపట్టాలన్నారు. వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని సూచించారు. వనమహోత్సవంలో మొక్కలు నాటాలని, పంచాయతీ కార్యాదర్శులు గ్రామాల్లో అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలందించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ చంద్రయ్య మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో జిల్లా ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ 08736-250501ను ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యసేవలందించడంతో పాటు పారిశుధ్యపనులను నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో డీపీవో వెంకటేశ్వ ర్‌రావు, జడ్పీ సీఈవో గణపతి, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

చింతలమానేపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం 32 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే మూడు నాలుగు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశ ఉందని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ దౌలత్, నాయకులు మల్లయ్య, సుధాక్, తిరుపతి, బాలాజీ, తుకారాం, పురుషోత్తంచారి, తివారి, రమేష్, పోషన్న, శంకర్, కారు, మోహన్, భాస్కర్, బలరాం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం



కాలనీవాసులతో మాట్లాడుతున్న సీఐ రవీందర్

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణ, ప్రజల భద్రత కోసం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీఐ బుద్దే రవీందర్ అన్నారు. జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీలో నలుగురు ఎస్సైలు, 30 మంది పోలీసు సిబ్బందితో కాలనీ సోదాలు నిర్వహించారు. సోదాల్లో సుమారు 40 ద్విచక్ర వాహనాలు, నాలుగు ఆటోలను స్వాధీన పర్చుకొని సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు.

నాణ్యమైన భోజనం అందించాలి

లింగాపూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో రామచందర్ అన్నారు. మండలంలోని కన్నేపల్లి, రామునాయక్‌తండా, ఏల్లాప టార్, గ్రామాల్లోని పాఠశాలలను ఎంపీడీవో రామచందర్, మండల పంచాయతీ అధికారి రజనీకాంత్‌రెడ్డి, మండలవిద్యాధికారి శ్రీనివాస్ తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన భోజనం అందించాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మౌనిక, సుధీర్, ఉత్తం తదితరులు పాల్గొన్నారు.

కేటేశ్వర కంకాలమ్మ ఆలయంలో చోరీ



వివరాలు వెల్లడిస్తున్న లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి

జన్నారం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వీర్లగుట్టపైన గల కేటేశ్వర కంకాలమ్మ ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ పూజారి రేగుంట భూమయ్య శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి నిందితుడిని మూడు గంటల్లో పట్టుకున్నారు. మండల కేంద్రంలోని పొన్కల్ గ్రామానికి చెందిన కొండపల్లి అశోక్ అనే వ్యక్తి కేటేశ్వర కంకలమ్మ ఆలయంలోని హుండీ పగులకొట్టి 300 రూపాయల విలువైన చిల్లర నాణేలు తీసుకపోవడమే కాకుండా ఆలయంలో వస్తువులు చిందరవందర చేశాడు. నిందుతుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి, జన్నారం ఎస్ఐ అనూష తెలిపారు. రామగుండం సీపీ అంబర్ కిషోర్‌ఝా, డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్, పోలీసు సిబ్బంది తుకారాం, సురేశ్, సంతోష్, శ్రీనివాస్ సిబ్బందిని అభినందించారు.

ఆసుపత్రి ఆవరణలో గుంతలు

- ఇబ్బందులు పడుతున్న రోగులు
- పట్టించుకోని అధికారులు



గుంతలమయంగా మారిన ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణం

కాగజ్‌నగర్‌టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది, రోగులను మరో కష్టం పీడిస్తోంది. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణ అంతా గుంతలు, బురదమయంగా మారింది. దీంతో రోగులు, ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి ఆసుపత్రి నిర్మించినప్పటికీ ఆసుపత్రి ఎదుట ఉండే రోడ్డు, ప్లాట్ ఫాం నిర్మాణం పూర్తి స్థాయిలో చేపట్టలేదు. ఎల్లాగౌడ్ తోటలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి భవనం ముందు భాగం పూర్తిగా బురదతో గుంతలమయంగా మారింది. సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో నిత్యం ఎక్కువమంది రోగులు, వారి బంధువులు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఆవరణ మొత్తంగా గుంతలమయంగా మారడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

● పీహెచ్‌సీ అప్‌గ్రేడ్..

కాగజ్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేసి ప్రభుత్వఆసుపత్రిగా మార్చి కోట్లాది రూపాయలు వెచ్చించి నూతనంగా భవనం నిర్మించారు. అయినప్పటికీ ఆసుపత్రి ఆవరణలో మాత్రం ఇబ్బందులు తప్పడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఆసుపత్రి ఆవరణలోనే పాత భవనంతో పాటు, మరో భవనంలో స్టోర్‌రూం, ఒక గదిలో పోస్టుమార్టం గదికి కేటాయించారు.

మరో పక్కన ఉన్న ఇంకో భవనంలో సీమాంక్ సెంటర్, డయాలసిస్ కేంద్రం ఉంది. సీమాంక్ సెంటర్, డయాలసిస్ కేంద్రానికి వచ్చే రోగులకు తిప్పలు తప్పడం లేదు. రాత్రివేళల్లో కనీసంలైట్లు కూడా లేకపోవ డంతో చీక ట్లోనే గుంతలమయగా ఉన్నరోడ్డు గుండా వెళ్లడం ప్రమాదకరంగా మారిందని చెబుతున్నారు. పోస్టు మార్టం కేంద్రానికి మృతదేహాన్ని తీసుకువచ్చి పోస్టు మార్టం నిర్వహించడం, ఇందుకోసం వచ్చి వెళ్లే వారు రాత్రనక, పగలనక ఉండాల్సిన పరిస్థితులు ఉంటాయి. ఆసుపత్రిలో 24గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉండగా, ఇక్కడకు వచ్చే రోగులకు ఆసుపత్రి ప్రాంగణం చిత్తడిగా, గుంతలమయంగా ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. దీంతోపాటు రాత్రివేళ అంధకారం అలుముకుంటుం డడంతో నరకయాతన పడాల్సి వస్తోంది. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించే భవనాలకు కనీసం సరైన రోడ్డు సౌకర్యం నిర్మించకుండా నిర్లక్ష్యంగా వదిలి వేయడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలి

దహెగాం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): హత్తిని గ్రామంలోని డీసీఎంఎస్ యూరియా పంపిణీ కేంద్రంపై సమగ్ర విచారణ చేపట్టాలని పలువురు యువకులు డీటీ గణేశ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలు వురు మాట్లాడుతూ డీసీఎంఎస్ కేంద్రం నిర్వాహకులు యూరియాను పక్కదారి పట్టించారని ఆరోపించారు. గ్రామంలోని చిన్న, సన్నకారు రైతులకు యూరియా దొర కక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ ధనుంజయ్, యువకులు సంజీవ్, రాకేష్, సతీష్, రవి, సాగర్, సుద్మాన్, మల్లేష్, రిషి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కౌటాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో హనుమంతు అన్నారు. శుక్రవారం ముత్తంపేట కాంప్లెక్స్, గురుడుపేట కాంప్లెక్స్, కౌటాల కాంప్లెక్స్ పరిదిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నారాయణసింగ్, నానాజీ, ఉపాధ్యాయులు, సీఆర్పీలు ప్రకాష్, దేవన్న, లాలాజీ, లూలజీ, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న తుడుం దెబ్బ నాయకులు

సిర్పూర్(యు), జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సోమవా రం నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని తుడుం దెబ్బ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పెందోర్ శకర్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం టైగర్ కన్జర్వేషన్ కారిడార్ పేరి టి తీసుకువచ్చిన జీవో 49ని నిలుపదల చేయడం కాదని, పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలను ప్రభుత్వాలు అడవి నుంచి దూరం చేయడానికి కుట్ర చేస్తున్నాయన్నారు. జీవో 49ని పూర్తిగా రద్దు చేసే వరకు తమ ఆందోళనలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అర్క నాగోరావు, తోడసం తీర్మాన్‌రావు, ఆత్రం ఓం ప్రకాష్, మాజీ ఎంపీటీసీ గేడం మారుతి, తుడుం దెబ్బ నాయకులు లచ్చన్న, సిడం సుభాష్, ఆత్రం రాము, సేడ్మకి బాపురావు, మెస్రం అంబారావు తదితరులు పాల్గొన్నారు.

కనువిందు చేస్తున్న బుగ్గ జలపాతం



జాలువారుతున్న బుగ్గ జలపాతం

వాంకిడి, జూలై 25 (ఆంధ్రజ్యోతి: మండలంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు సర్కెపల్లి అటవీ ప్రాంతంలోని బుగ్గ జలపాతం కనువిందు చేస్తోంది. గుట్టపై నుంచి జాలువారుతున్న నీటి ప్రవాహం పాలనురగలా కనిపిస్తూ సందర్శకులను ఆకట్టుకుంటోంది. మండల కేంద్రానికి సుమారు 9 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ జలపాతా నికి సర్కెపల్లి వరకు రోడ్డు మార్గం ఉంది. అక్కడి నుంచి మూడు కిలో మీటర్ల మేర అటవీ ప్రాంతంలో ప్రయాణించాల్సి ఉంటుంది. ఈ జలపాతానికి సరైన రోడ్డు సదుపాయం లేక పోవడంతో సందర్శకులు వెళ్లలేక ఆచరణకు నోచుకోవడం లేదు. అటవీ ప్రాంతంలో వర్షానికి బురద మయంగా మారడంతో వాహదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): భావి తరాలకు సహజ సిద్ధమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో శుక్రవారం వైద్య విద్యార్థులు, నర్సింగ్ కళాశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన మహోత్సవం కార్యక్రమంలో స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలన్నారు. ఆసుప్రతి ఆవరణలో గల ఖాళీ స్థలంలో ఫలాలు అందించే మొక్కలు, పూజల మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం పట్టణంలోని ఉర్దూ మాధ్యమ ఉన్నత పాఠశాలను విద్యాశాఖాదికారులతో కలిసి సందర్శించారు. తరగతి గదులు, ఉపాధ్యాయులు అందిస్తున్న బోధన, విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యత పరిశీలించారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమంలో భాగంగా అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో నాణ్యమైన భోజనం అందించాలని చెప్పారు. వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. జిల్లా, మండల స్థాయి అధికారులు తమ పరిధిలోని ప్రతి పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధన, భోజనం, విద్యార్థుల ఆరోగ్యం అంశాలపై తనిఖీలు నిర్వహించాలన్నారు. ఏమైన సమస్యలు ఉన్నట్లయితే వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో పారిశుధ్య పనులు ప్రతి రోజు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో అదనపు తరగతి గదులు, శుద్ధమైన తాగునీరు, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులను పలు సబ్జెక్టులలో ప్రశ్నలు అడిగి వారి పఠన సామర్థ్యాన్ని పరీక్షించారు. విద్యార్థులతో మాటాడారు. కార్యక్రమంలో ఆసు పత్రి పర్యవేక్షకుడు డాక్టర్ ప్రవీణ్, ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి ఉదయ్‌బాబు, వైద్య సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్, (ఆంధ్ర జ్యోతి): జిలాల్లో ఆదివారం నిర్వహించనున్న గ్రామ పాలన అధికారుల స్క్రీ నింగ్, లైసెన్స్‌డ్ సర్వేయర్ల అర్హత పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి పరీక్షల నిర్వహణపై శుక్రవారం పోలీసు, రెవెన్యూ, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖాధి కారులు, ఆర్టీసీ, మున్సిపల్ కమిషనర్లు, ముఖ్య పర్యవే క్షకులు, పరిశీలకులు, ఇన్విజిలేటరు, ముఖ గుర్తింపు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 27న నిర్వహిం చనున్న గ్రామ పాలన అధికారుల స్క్రీనింగ్, లైసెన్స్‌డ్ సర్వేయర్ల అర్హత పరీక్షను జిల్లా కేంద్రంలోని జన్కాపూ ర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించను న్నామని చెప్పారు. గ్రామ పాలన అధికారులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్ష ఉంటుందని చెప్పారు. లైసెన్స్‌డ్ సర్వే యర్లకు రెండు సెషన్లలో పరీక్ష నిర్వహంచనున్నామని తెలిపారు. సంబంధిత శాఖాధికారులు సమన్వయంతో పని చేసి పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ సీతారాం, విద్యుత్ శాఖ ఎస్ఈ శేషరావు, డీఎం రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్ గజానన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పీఏపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు

చెన్నూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు నియోజకవర్గంలోని దళిత నాయకులపై అసత్య ఆరోపణలు చేస్తూ బురద చల్లే ప్రయత్నం చేస్తున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి పీఏ రమణారావుపై కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం చెన్నూరు పోలీస్ స్టేషన్‌లో హౌజ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భం గా బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ రాజారమేష్ మాట్లాడుతూ మంత్రి వివేక్‌వెంకటస్వామి అగ్ర కులాలకు కొమ్ము కాస్తూ తన పీఏలతో దళితులపై కక్షపూరితంగా అసత్యపు ప్రచారాలు చేయించడం బాధాకరమన్నారు. దళితులపై అసత్యపు ప్రచారాలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బాలుడి అప్పగింత

బెల్లంపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏఎంసీ ఏరియాలో తప్పిపోయిన ఓ బాలుడిని శుక్రవారం బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. రాజస్థాన్‌కు చెందిన వారు బతుకుదెరువు కోసం ఆరేళ్లబాబుతో బెల్లంపల్లిలోని ఏఎంసీ ఏరియాకు వచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం తల్లిదండ్రులను విడిచి బాలుడు నడుచుకుంటూ కొంతదూరం వెళ్లాడు. చుట్టుపక్కల వారు కొంతమంది యువకులు బాలుడు తప్పిపోయాడని గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందజేయడంతో పోలీసు బ్లూకోల్ట్స్ సిబ్బంది రాంప్రసాద్, ప్రవీణ్ కుమార్ అక్కడికి చేరుకొని బాలుడిని వివరాలు అడిగి తెలుసుకొని తల్లిదండ్రులకు అప్పగించారు.

ప్రమాదరహిత ఉత్పత్తే యాజమాన్యం లక్ష్యం



మాట్లాడుతున్న డైరెక్టర్ ఆఫ్ మైన్ సేఫ్టీ (మైనింగ్) నాగేశ్వర్‌రావు

మందమర్రిటౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రమాద రహిత ఉత్పత్తే ప్రధాన లక్ష్యమని, ప్రమాదాల నివారణకు యాజమాన్యం అత్యంత సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు వెళ్తుందని హైద్రాబాద్ రీజియన్ టూ సౌత్ సెంట్రల్ జోన్ డైరెక్టర్ ఆఫ్ మైన్ సేఫ్టీ (మైనింగ్) నాగేశ్వర్‌రావు తెలిపారు. స్థానిక ఎల్లందు క్లబ్‌లో శుక్రవారం మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల రక్షణ త్రైపాక్షిక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రక్షణ అనేది ప్రతి ఉద్యోగి, అధికారికి తప్పనిసరి అనే విషయాన్ని విస్మరించవద్దన్నారు. రక్షణ సూత్రాలను విస్మరించడం ద్వారానే ప్రమాదాలు సంభవి స్తాయని పేర్కొన్నారు. మందమర్రి ఏరియాలో ప్రమాదాలు జీరో శాతం ఉండడం అధికారులు, ఉద్యోగులు రక్షణ సూత్రాలు పాటించడం వల్లనే సాధ్యమైందన్నారు. అంతేకాకుండా ఓపెన్‌కాస్టుల్లో ప్రమాదాల నివార ణకు తీసుకుంటున్న జాగ్రత్తలు అభినందనీయమన్నారు. పని నైపుణ్యం గల ఉద్యోగులను సునిశితమైన ప్రదేశాల్లో విధులను పురమాయించాలన్నారు. సింగరేణి డైరెక్టర్ (పీపీ) వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యాజమాన్యం రక్షణకు సంబంధించి పకడ్బందీగా చర్యలు చేపడుతుందన్నారు. ఉద్యోగులు, అధికారులు కలిసి కట్టుగా రక్షణ సూత్రాలు పాటిస్తూ ప్రమాద రహిత ఉత్పత్తిని సాధించాలన్నారు. రక్షణకు యాజమాన్యం పెద్దపీట వేస్తుందన్నారు. ఉద్యోగులు, అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా రక్షణపై ప్రధాన దృష్టిని సారించాలన్నారు. కార్పొరేట్ జీఎం సేఫ్టీ చింతల శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగులు, అధికారులు ఎవరైనా రక్షణకు సంబంధించిన సూచనలు ఇచ్చినా పాటిస్తామ న్నారు. ఇటీవల ప్రమాదాలు తగ్గడానికి ప్రధాన కారణం రక్షణ సూత్రాలు పాటించడమేనని తెలిపారు. యూనియన్‌ల నాయకులు మాట్లాడుతూ గనుల్లో రక్షణపై యాజమాన్యం తీసుకుంటున్న శ్రద్ధ సరైంది అయినప్పటికీ, ఉత్పత్తికి సంబంధించి నాణ్యమైన పరికరాలను అందజేయాలన్నారు. అంతకుముందు చనిపోయిన ఉద్యోగులకు, అధికారులకు నివాళులర్పించారు. అనంతరం రక్షణపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏఐటీ యూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారా యణ, డీఎంఎస్ ఎలక్ట్రికల్ రాజ్‌కుమార్, డీవైడీఎంఎస్ ఎలక్ట్రికల్ ఎస్ఈ రాజీవ్ ఓం ప్రకాష్ వర్మ, అధికారులు ప్రేమ్‌కుమార్, కోమల్‌చౌదరి, అనికేత్‌సింగ్, మందమర్రి జీఎం దేవేందర్, బెల్లంపల్లి జీఎం విజయభాస్కర్‌రెడ్డి, రఘుకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌వోటూ జీఎం విజయ్ ప్రసాద్, అబ్దుల ఖాదర్, గ్రూపు ఏజెంటు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సంస్థ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలి



డైరెక్టర్‌కు మొక్క అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సంస్థ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిం చాలని ఏఐటీయూసీ నాయకులు అన్నారు. సింగరేణిలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(కోల్ మూమెంట్)గా ఇటీవల బాధ్యతలు తీసుకున్న జాదవ్ వెంకన్నను ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, ఉప ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, వైవీ రావు, ముస్కె సమ్మయ్య, మడ్డి ఎల్లయ్యగౌడ్ హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో శుక్రవారం కలిసి అభినందించారు. పూలమొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ సింగరేణి అభివృద్ధిలో కోల్ మూమెంట్, మార్కెటింగ్ ప్రముఖపాత్ర పోషిస్తాయని సంస్థ ఎదుగుదలకు సహకారం అందిస్తామని తెలిపారు.

హక్కుల సాధనకు పోరాటం

మందమర్రిటౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కార్మికుల హక్కుల సాధన కోసం తమయూనియన్ రాజీలేని పోరాటం చేస్తోందని ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, కేకే 5 గని ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల ముందు తాము ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషి చేస్తు న్నామన్నారు. కార్మికుల సొంతింటి కల, ఇన్‌కంటాక్స్ రద్దు కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలన్నారు. వార్షిక లాభాలను వెల్లడించి లాభాల వాటా 35 శాతం చెల్లించాలన్నారు. ఉద్యోగ విరమణ కార్మికులకు ఉచిత వైద్యం అందించాలన్నారు. నిలిచిపోయిన మెడికల్ బోర్డును తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు. క్యాంటీన్‌లలో నాణ్యమైన ఆహారం అందించాలని, క్లరికల్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తమ యూనియన్‌ను విమర్శించే అర్హత ఎవరికి లేదని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమణ, రాజేశ్వర్‌రావు, సుదర్శన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సంపత్, ప్రభాకర్ యాదవ్, ఓదెలు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

ఆసిఫాబాద్, జూలై 25(ఆంధ్రజ్యోతి): మనకచర్ల ప్రాజెక్టుపై ప్రజలు, విద్యార్థులలో చైతన్యం తీసుకు రావడంలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ బాలికల డిగ్రీల కళాశాలలో టీఆర్ఎస్‌వీ నాయకులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు మస్తాఫా, రాజ్‌కుమార్ శ్రీకాంత్, వికాస్, కోటేష్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

బెజ్జూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా అధిక వర్షాల వల్ల పత్తి పంటకు గాలి, వెతులురు అందక మొక్కలు వడలిపోయినట్టుగా ఎండి పోయే అవకాశం ఉందని రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో నాగరాజు అన్నారు. రెబ్బెన గ్రామ శివారులో రైతులకు నానో యూరియా వాకడకంపై శుక్రవారం అవగాహన కల్పించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కాగజ్‌నగర్ టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుడు పెరక కృష్ణ కుమారుడు నిఖిల్ సాత్విక్ ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట కోనేరు యువసేన సభ్యుడు వంశీ తదితరులు ఉన్నారు.

రైతులకు భారమే...

- పెరిగిన ఎరువుల ధరలతో ఇబ్బందులు

(5వ పేజీ తరువాయి)

సంబంధించి మొత్తం 78,073 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా ఇప్పటి వరకు 49,239.571 మెట్రిక్ టన్నులు జిల్లాకు చేరింది. ఇంకా సీజన్ ముగిసే సరికి 28,833.429 మెట్రిక్ టన్నులు రావాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా రైతులకు అవసరం ఉన్నవాటిలో యూరియా 28,506 మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా ప్రస్తుతం 37,79మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది. అలాగే డీఏపీ 9082 మెట్రిక్ టన్నులు అవసరం కాగా ప్రస్తుతం 646.08 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది. ఎస్ఎస్‌పీ 1740 మెట్రిక్ టన్నులు అవసరం కాగా 613.06 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది. ఎంఓపీ 2245 మెట్రిక్ టన్నులకు గాను 1079.55 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉండగా కాంప్లెక్స్ 36,500 మెట్రిక్ టన్నులు అవసరం కాగా 7964.63మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది. మిగితా మొత్తం విడతలవారీగా జిల్లాకు రానున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

జీవో నంబరు 49ని పూర్తిగా రద్దు చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జీవో నంబర్ 49ను పూర్తిగా రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. శుక్రవారం మంచిర్యాలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ మెప్పు కోసం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నెంబరు 49ని తీసుకువచ్చిందన్నారు. దీనిపై పెద్ద ఎత్తున ఆందోళనలు చేయడం, ఏజెన్సీ బంద్ చేయడంతో ప్రభుత్వం జీవోను తాత్కాలికంగా నిలిపివేసిందన్నారు. వెంటనే జీవోను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బోడెంకి చందు, సామల ఉమారాణి, సరిత, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కోటపల్లి(ఆంధ్రజ్యోతి): జీవో 49ని తాత్కాలికంగా నిలిపివేయడం కాదని, రద్దు చేయాలని, రద్దు చేసేంత వరకు పోరాటం తప్పదని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం అన్నారు. సంఘం నాయకులతో కలిసి శుక్రవారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బా గాల మహేష్, ఆత్రం చిన్నన్న, భీమేష్, బాగాల పున్నం, భీమన్న, అశోక్ పాల్గొన్నారు.

శత వసంతాల బొట్ల ఆగమ్మ



ఆగమ్మ 100వ పుట్టిన రోజు వేడుకలు జరుపుతున్న కుటుంబ సభ్యులు

మంచిర్యాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన బొట్ల ఆగమ్మకు శుక్రవారంతో వంద సంవత్సరాలు పూర్తి కావడంతో కుటుంబ సభ్యులు పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గోసేవా మండల్ కాలనీకి చెందిన బొట్ల ఆగమ్మకు ఆరుగురు కుమారులు, ఒక కూతురు ఉండగా కుటుంబ సభ్యుల సమక్షంలో వందో పుట్టిన రోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కాగా ఇప్పటికీ తన తల్లి పూర్తి ఆరోగ్యంగా ఉందని ఆగమ్మ కుమారుడు బొట్ల సత్యం తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

జైపూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతి బాపురావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గంగిపెల్లి, శెట్‌పల్లి, బెజ్జాల, వేలాల గ్రామాలను సందర్శించారు. పంచాయతీల రికార్డులను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటరు జాబితా తయారు విధానంపై అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వేదశ్రీ, పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణ, ప్రతిభ, రమాదేవి, రాజేష్‌లు పాల్గొన్నారు.

లక్షెట్టిపేట: కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదల సొంతింటి కల సాకారం అవుతోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్ కుమార్ అన్నారు. పట్టణంలోని 14వ వార్డులో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ మానస, పార్టీ వార్డు అధ్యక్షుడు ఉత్తూరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డుకు మరమ్మతు



కల్వర్టు వద్ద రోడ్డుకు మరమ్మతు చేయిస్తున్న పోలీసులు

కోటపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని నక్కలపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డులో కల్వర్టు వద్ద రోడ్డు పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో స్థానిక పోలీసులు శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. చెన్నూరు రూరల్ సీఐ బన్సీలాల్, కోటపల్లి ఎస్ఐ రాజేందర్ గ్రామస్థుల సహకారంతో ఎక్స్‌కవేటర్‌తో కోతకు గురైన కల్వర్టు వద్ద పైపులను ఏర్పాటు చేశారు. అనంతరం మట్టిపోసి మరమ్మతు పూర్తి చేయించారు. దీంతో రాకపోకలు ప్రారంభమయ్యాయి. స్థానిక నాయకులు తోట అశోక్, శ్రావణ్‌రెడ్డి, గ్రామస్థులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

దూర విద్యతో.. దగ్గరైన చదువులు



చదువు మానేసిన వారికి వరంగా 'ఓపెన్' స్కూల్స్

- కొనసాగుతున్న ఎస్సెస్సీ, ఇంటర్ ప్రవేశాలు
- జిల్లాలో 20 సెంటర్లు

నెన్నెల, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : చదువుకున్నాం అని చెప్పేందుకు పదోతరగతి ఉత్తీర్ణత ఓ అర్హత. అందరు విద్యార్థి దశలో జీవితాలు ఒకేలా ఉండవు. చదువుకుంటున్న వారిలో జోలెడు అడ్డంకులు ఎదుర్కొంటున్న వారెందరో ఉంటారు. ఏదో ఒక కారణంతో వారు పదికిలోపే చదువు మానేయాల్సి వస్తుంది. అలాంటివారిలో తరువాతైన చదువుకుందామనే ఆలోచన వచ్చినవారికి దూర విద్యమేలు చేస్తోంది. 15ఏళ్ల నిండిన వారంతా నేరు గా పదోతరగతిలోచేరి తమపని తాము చేసుకుంటూనే వారంతపు చదువులకు హాజరు కావచ్చు. వాక్యాలు రాయడం, చదవడం వచ్చి ఎలాంటి విద్యార్హత లేకపోయిన తెలంగాణ ఓపెన్‌స్కూల్ సొసైటీ (టీవోఎస్ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించే సెంటర్లలో జాయిన్ కావచ్చు. పరీక్షలురాసి చక్కగా పదోతరగతి మెమో, టీసీ పొందవచ్చు. ఇలాగే టెన్త్‌తో పాటు ఓపెన్‌ఇంటర్ కూడా అందుబాటులో ఉంది. ఇంటర్‌లో చేరేవారు పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం ప్రవేశాలు కొన సాగుతున్నాయి. జూలై31లోగా ప్రవేశం పొందవచ్చు.

● వరంగా ఓపెన్ స్కూల్...

దూరవిద్యతో చదువులు దగ్గిరవుతున్నాయి. ఇప్పటికే చిన్నపాటి ఉద్యోగాలు చేస్తూ ప్రమోషన్‌కు విద్యార్హత అడ్డంకిగా ఉన్నవారికి దూరవిద్య వరంగా పరిణమిస్తోంది. ఎంచక్క డ్యూటీ చేస్తూనే సెలవురోజుల్లో తరగతులకు హాజరుకావచ్చు. పరీక్షలురాసి పాస్ అయినవారు పదోన్నతలు పొందవచ్చు. అంగన్‌వాడీ కార్యకర్తలు, అటెండర్లు, బ్యాంకుల్లో పనిచేసే మెసెంజర్లు, రికార్డు అసిస్టెంట్లు తదితర ఉద్యోగులు సైతం దూర విద్యలో చేరవచ్చు. ఆటో, జీపు, లారి, ట్రాక్టరు తదితర వాహనాల డ్రైవర్ల లైసెన్సు జారికి విద్యార్హత తప్పని సరి కావడంతో మోటర్ ఫీల్డ్‌వాళ్లు సైతం ఓపెన్‌స్కూల్‌లో అడ్మిషన్‌పొంది చదువుకొనవచ్చు. గృహిణులు సైతం దూరవిద్యను సద్వినియోగం చేసుకోవచ్చు. రెగ్యులర్‌గా చదివి పాస్‌అయిన వారితో సమానంగా ఓపెన్ చదువులకు ప్రాధాన్యత ఇస్తుండటంతో చదువు మానేసిన డ్రాపౌట్స్ సైతం బడిబాట పట్టొచ్చు.

● ఓపెన్ స్కూల్ ఎస్సెస్సీ సెంటర్లు ఇవే..

జడ్పీఎస్ఎస్ ఇందన్‌పల్లి, దండెపల్లి, ముత్యంపల్లి, తాండూరు, కన్నెపల్లి, వేమనపల్లి, బజార్ ఏరియా బెల్లంపల్లి, ఐడియల్ ఫౌండేషన్ బెల్లంపల్లి, మందమర్రి, రామకృష్ణపూర్, మంచిర్యాల, ఎస్ఆర్‌వీ హైస్కూల్ సీసీసీ నస్పూర్, జైపూర్, ముదిగుంట, చెన్నూరు ఉన్నత పాఠశాలల్లో సెంటర్లు ఉన్నాయి.

ఇంటర్ కేంద్రాలు..

ప్రభుత్వ జూనియర్‌కాళాశాల లక్షెట్టిపేట, ప్రభుత్వ జూనియర్ కాలేజీ బెల్లంపల్లి, శ్రీహర్ష జూనియర్ కాలేజీ మంచిర్యాల, ఎస్ఆర్ఆర్ జూనియర్ కాలేజీ మంచిర్యాల, ప్రభుత్వ జూనియర్ కాలేజీ చెన్నూరులలో ఓపెన్ స్కూల్ సెంటర్లు ఉన్నాయి.

ప్రవేశాలు కొనసాగుతున్నాయి...



మంచిర్యాల జిల్లాలో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో 20సెంటర్లు నడుస్తున్నాయి. ప్రస్తుతం ఓపెన్ స్కూల్స్‌లో ఎస్సెస్సీ, ఇంటర్ ప్రవేశాలు కొనసాగుతున్నాయి. జూలై 31లోగా దరఖాస్తు చేసు కోవాలి. 15 ఏళ్ల పైబడి చదవడం, రాయడం వచ్చిన వారు పదో తరగతిలో చేరవచ్చు. ఇంటర్‌మీడియట్‌లో చేరే వారు ఎస్సెస్సీ పాసై ఉండాలి. ఫీజులు సైతం అతి తక్కువగా ఉంటాయి. ఆసక్తిగల వారు దర ఖాస్తు చేసుకొని దూర విద్యను సద్వినియోగం చేసు కోవాలి. చేరిన వారికి పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందజేస్తాం. సెలవు దినాల్లో తరగతులు నడుస్తాయి. పాసైన వారికి రెగ్యులర్ చదువులతో సమానంగానే ప్రాధాన్యత లభిస్తుంది.

- అశోక్, కోఆర్డినేటర్, ఆదిలాబాద్ జిల్లా

సంక్షిప్త సమాచారం..

మందమర్రిరూరల్: బొక్కలగుట్టలోని గాంధారి మైసమ్మ జాతర ప్రశాంతంగా ముగిసిన సందర్భంగా మైసమ్మ ఆలయం వద్ద ఆలయ కమిటీ సభ్యులు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు, మందమర్రి, రామకృష్ణపూర్ ఎస్ఐలను సన్మానించారు.

జన్నారం: జన్నారం మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ప్రభంజనం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు వినతిపత్రం అందజేశారు.

మంచిర్యాల కలెక్టరేట్: యూనియన్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ కరీంనగర్ రీజియన్ సెక్రెటరీ చేగొండ వెంకటేష్ ఆధ్వర్యంలో దివంగత నల్లూరి వెంకట సత్యనారాయణ జయంతి సందర్భంగా మంచిర్యాల ఐబీ చౌరస్తాలోని యూనియన్ బ్యాంకులో రక్తదాన శిబిరం నిర్వహించారు.

దండేపలి: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన గుమ్మడి సతీష్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో ద్వారక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005-06 విద్యాసంవత్సరంలో చదువుకున్న తోటి స్నేహితులు కలిసి పోగు చేసిన రూ. 25వేల నగదును కొండాపూర్‌లో సతీష్ కుటుంబసభ్యులకు అందజేశారు.

మంచిర్యాలక్రైం: మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వర్షాకాలం కార్మికులకు రేయిన్‌కోట్లు, లాంగ్‌బూట్లు, గ్లౌజులు ఇప్పించాలని కోరారు.

● మాదవ సేవా సమితి చారిట్రబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పుష్యమి నక్షత్ర సందర్భంగా బాలలకు స్వర్ణామృత ప్రాశన చేశారు. కార్యక్రమంలో డాక్టర్ చందూరి సంతోష్, కోశాధికారి రేవెల్లి బాపూజీ, ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రచారక్ నాగరాజు ఉన్నారు.

బీజేపీలో చేరికలు

వేమనపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ముల్కలపేట గ్రామానికి చెందిన మొగిలి, పురుషోత్తం శుక్రవారం వేమనపల్లి మండల కేంద్రంలో బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి మండల అధ్యక్షుడు ఏట మధుకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట కృష్ణ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు పార్టీ బలోపేతం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, చరణ్‌రాజ్, శ్రీకాంత్, సత్యనారాయణ, రమేష్‌గౌడ్, అజయ్‌కుమార్, వెంకటేష్, కిశోర్, స్వామి, అంజన్న, రాజన్న, పోచయ్య, రాహుల్, సమ్మయ్య శేఖర్ పాల్గొన్నారు.

వన మహోత్సవం

కోటపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలపల్లి గ్రామంలో శుక్రవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్థులు, విద్యార్థులతో కలిసి స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో అటవీ అధికారులు మొక్కలు నాటారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అటవీ సెక్షన్ అధికారులు రాజమౌళి, స్వామి, బీట్ అధికారులు అశోక్, స్వామి, నాయకులు తోట అశోక్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

కోటపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నాయకులు, కార్యకర్తలంతా స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు పెద్దపల్లి పురుషోత్తం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాల వర్క్‌షాపు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ త్వరలోనే ఎన్నికలు రానున్నాయని, స్థానిక ఎన్నికల్లో బీజేపీ పార్టీ విజయం సాధించాలంటే ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షురాలు పెద్దింటి స్వప్న పున్నంచంద్, మండల ఎన్నికల ప్రబారి అక్కల రమేష్, ఎన్నికల కన్వీనర్ మంత్రి రామయ్య, ఉపాధ్యక్షుడు పెద్దింటి లక్ష్మణ్, ఇప్ప సంపత్, జనరల్ సెక్రెటరీ వడ్లకొండ రాజేష్, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల పొలం బాట

మందమర్రిరూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : సారంగపల్లి గ్రామంలో శుక్రవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమాన్ని విద్యుత్‌ఏఈ ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు మోటార్లకు కెపాసిటర్లను బిగించుకోవాలన్నారు. తడి చేతులతో మోటార్లను ఆన్ చేయవద్దన్నారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు విని.. హాస్టల్‌లో నిద్రించి..

జన్నారం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలను గురువారం రాత్రి జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి జనార్దన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కూర్చుని వారి సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పదో తరగతిలో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం రాత్రి వసతి గృహంలో నిద్రించారు. తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంపీడీవో ఉమర్ షరీఫ్, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆశ్రమ పాఠశాలలో నిద్రిస్తున్న గిరిజన సంక్షేమశాఖ అధికారి జనార్దన్

భారీ వర్షం: రోడ్లు జలమయం



మందమర్రిలో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

మందమర్రిటౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మందమర్రి పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. స్థానిక కేకే 5 గని సమీపంలోని నివాసాల మధ్యలోకి వర్షం నీరు చేరింది. కార్మెల్ స్కూల్ నుంచి పోలీస్‌స్టేషన్ మధ్యలోని రోడ్డుపై భారీగా వరద నీరు ప్రవహిస్తోంది. వర్షంతో చిరు వ్యాపారాలకు అంతరాయం కలిగింది. పాలవాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. పాల చెట్టు ఏరియా నుంచి కేకే 5 బంగ్లాస్ వరకు రోడ్డు నీటితో నిండిపోయింది. పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని ఊరు మందమర్రి చెరువు నిండుకుండలా తయారైంది. స్టేషన్ రోడ్డుకు కూడా వరద నీరు చేరింది. ఓపెన్‌కాస్టుల్లో వరద నీరు చేరడంతో ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. వర్షం కారణంగా సింగరేణి కార్మికుల గైర్హాజరు శాతం పెరిగింది.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి

లక్షెట్టిపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థికి చదువుకునే సమయం నుంచే పలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవ సహాయక కమిటీ చైర్మన్ సాయికిరణ్ కాసమల అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి పట్టుదల క్రమశిక్షణతో చదవాలని ఒక లక్ష్యం ఎంచుకుని దాని కోసం సాధన చేయాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే ప్రతీ ఒక్కరూ వివిధ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రతీ సమస్యకు పరిష్కారం ఉంటుందని దానికి న్యాయ సంస్థలో ఒక చట్టం ఉంటుందని వివరించారు. పలు చట్టాలపై వాటి విదానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న, ఉపాధ్యక్షుడు నళినికాంత్, ఏజీపీ సత్యం, ప్రధానకార్యదర్శి ప్రదీప్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు కిరణ్‌కుమార్, కారుకూరి సురేందర్, సుమన్ చక్రవర్తి, శ్రీదర్, రాజేశ్వర్, వివిధ పాఠశాల, కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్

వైభవంగా మణిద్వీప వర్ణన పారాయణం

దండేపల్లి జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం ప్రారంభం కావడంతో దండేపల్లిలో ఆర్యవైశ్య మహిళ సంఘాల ఆధ్వర్యంలో మణిద్వీప పారాయణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం ఆర్యవైశ్య మహిళలు ఓ ఇంటిలో శ్రావణ మాస ప్రత్యేక పూజలు చేశారు. ప్రతీ మంగళవారం, శుక్రవారం మణిద్వీప వర్ణన పారాయణ ప్రత్యేక పూజలను 108 ఆర్యవైశ్య ఇళ్లలో నిర్వహిస్తామని మహిళలు పేర్కొన్నారు.

బ్యాంకు సేవా కేంద్రం ప్రారంభం

కోటపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కోటపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంకు శాఖ ఆధ్వర్యంలో కొండంపేటలో బ్యాంకు సేవా కేంద్రాన్ని శుక్రవారం శాఖ కార్యనిర్వహణ అధికారి రాజేష్ ప్రారంభించారు. గ్రామానికి చెందిన సమ్మయ్యను బ్యాంకు మిత్రగా నియమించామన్నారు.

చినుకు పడితే చిత్తడే..



బురదమయంగా మారిన నెల్కివెంకటాపూర్‌లో 30వ డిస్ట్రిబ్యూటరీని ఆనుకుని ఉన్న రోడ్డు

దండేపల్లి జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మండలంలో కురిసిన వర్షాలకు రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. దండేపల్లి మండలం నెల్కివెంకటాపూర్‌లో 30వ డిస్ట్రిబ్యూటరీ కాలువ అనుకోని ఉన్న వీధిలోని రోడ్డు బురదమయంగా మారి కాలనీ వాసులు నడవడానికి కష్టంగా ఉంటోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఈ రోడ్డు మరమ్మతుల కోసం ఎర్రటి మట్టి పోశారు. కాగా ఇటీవల కురిసిన వర్షలకు రోడ్డు మొత్తం బురదమయంగా మారి అటు వైపు నడవాడానికే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

జిల్లా వైద్యాధికారి హరీష్ రాజ్

నస్పూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా, దోమలు వృద్ధి చెందకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు చేపట్టాలని జిల్లా వైద్యాధికారి హరీష్‌రాజ్ సూచించారు. విలేజ్ నస్పూర్‌లో శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి హరీష్‌రాజ్ పలు ఇళ్లను సందర్శించారు. ఇంటి పరిసరాల్లో నీటి గుంతలు ఉండగా అందులో దోమలు నివారణ మందు స్ప్రే చేయించారు. నిల్వఉన్న నీటిని పారబోయించారు. దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ అనిత, నస్పూర్ మెడికల్ ఆఫీసర్ వెంకటేష్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు, జిల్లా మాస్ మీడి యా అధికారి బుక్కం వెంకటేశ్వర్ పాల్గొన్నారు.



నస్పూర్‌లో మురుగు గుంతలో స్ప్రే చేస్తున్న వైద్య సిబ్బంది, పక్కన జిల్లా వైద్యాధికారి హరీష్ రాజ్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జైపూర్ (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జైపూర్ మెడికల్ ఆఫీసర్ ముస్తాఫా పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ముదిగుంట గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. 65 మందికి వైద్య పరీక్షలు చేసి 18 మంది రక్తనమూనాలను సేకరించారు. అనంతరం గ్రామంలోని వీధులను పరిశీలించి కుండీలు, కూలర్లు, డబ్బాల్లో ఉన్న నీటి నిల్వలను పారబోయాలని సూచించారు. వైద్యులు అశోక్‌కుమార్, కమలాకర్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

దండేపల్లి (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు వహించాలని దండేపల్లి వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం దండేపల్లి కస్తూర్బా విద్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డెంగ్యూ, మలేరియా, సీజనల్ వ్యాధుల నివారణపై డ్రైడే కార్యక్రమాన్ని చేపట్టి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కేజీబీవో ఎస్‌వో భాగ్యలక్ష్మి, సీహెచ్‌వో రాజిరెడ్డి, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, సూపర్‌వైజర్లు వసంతకుమారి పాల్గొన్నారు.

జర్నలిస్టులకు అండగా టీయూడబ్ల్యూజే

మందమర్రిటౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల హక్కుల సాధనే ఏకైక లక్ష్యంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) పనిచేస్తోందని యూనియన్ జిల్లా అధ్యక్షుడు డేగ సత్యం తెలిపారు. శుక్రవారం స్థానిక సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన టీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రమాదంలో మృతి చెందిన జర్నలిస్టులకు ప్రభుత్వపరంగానే కాకుండా యూనియన్ పరంగా ఆర్థికసాయం అందిస్తున్నామన్నారు. అనారోగ్యంతో బాధపడేవారికి కూడ ఆ కుటుంబాలకు అండగా ఉన్నామని తెలిపారు. మందమర్రికి సంబంధించి సింగేణి యాజమాన్యం జర్నలిస్టులకు క్వార్టర్ల కేటాయింపుతో పాటు అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం గృహాలు ఇవ్వాలని మంత్రి వివేక్‌కు, స్థానిక జీఎంకు వినతిపత్రాలు సమర్పిస్తామని తెలిపారు. అనంతరం నూతన సభ్యత్వాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పింగిలి సంపత్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రకాశ్‌రెడ్డి, కోశాధికారి వంశీ, ఉపాధ్యక్షులు సురేశ్‌చౌదరి, టి రవిరాజు, మద్దెల సంజీవ్, చిలువేరు నర్సయ్య, కొండ్రు శ్రీనివాస్, దేవరాజు, కల్వల శ్రీనివాస్, ఆర్ రమేశ్, ఉదయ్‌కుమార్; సత్యం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీయూడబ్ల్యూయూజే జిల్లా అధ్యక్షుడు సత్యం

జన్నారం బంద్ విజయవంతం




వినతిపత్రాన్ని స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

జన్నారం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్ టైగర్‌జోన్ పేరిట జన్నారం అభయారణ్యంలోని ప్రధాన రహదారి గుండా భారీ వాహనాలు అనుమతించాలని డిమాండ్ చేస్తూ వారం రోజులుగా మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సామాజిక కార్యకర్త భూమాచారి, బద్రీనాయక్ రిలే నిరహార దీక్ష చేపట్టారు. అందులో భాగంగా శుక్రవారం జన్నారం బంద్‌కు పిలుపునిచ్చారు. దీంతో మండల వాణిజ్య సంస్థలు బంద్‌ను స్వచ్ఛం దంగా పాటించాయి. మండల కేంద్రంలో ప్రగతిబాట కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన కలెక్టర్ కుమార్ దీపక్ రిలే నిరహార దీక్ష శిబిరాన్ని సందర్శించగా భూమాచారి, బద్రీనాయక్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్కడి యువతకు ఉపాధి కరువు అవుతోందని భారీ వాహనాలకు అనుమతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు ఉన్నారు. అనంతరం మండల కేంద్రంలోని రామాలయం, అంబేద్కర్ ప్రాంతాన్ని కలెక్టర్ కుమార్ దీపక్ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న ప్రభుత్వ భూములు పూర్తిస్థాయిలో కబ్జాకు గురయ్యాయని స్థానికులు నాయకులు కలెక్టర్‌కు విన్నవించారు. వెంటనే హద్దులు గుర్తించాలని డిమాండ్ చేశారు. వారి వెంట అధికారులు ఉన్నారు.

తరగతి గదుల్లో నిఘా

- నిరంతర పర్యవేక్షణకు సీసీ కెమెరాల ఏర్పాటు
- ఒక్కో జూనియర్ కళాశాలకు 14 నుంచి 16 వరకు కేటాయింపు
- విద్యార్థుల హాజరు, ఫలితాలు మెరుగుపడే అవకాశం


బెజ్జూరు కళాశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

లెక్చరర్లు క్లాస్‌కు వచ్చారా? పాఠాలు చెబుతున్నారా? క్లాస్‌లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు అని పర్యవేక్షించేందుకు ఇంటర్ విద్యాశాఖ సీసీ కెమెరాలు విని యోగించనున్నది. ఈ మేరకు జూనియర్ కళాశాలల తరగతి గదుల్లో అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు.

బెజ్జూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కాలశాలల్లో ఇక నుంచి నిరంతర పర్యవేక్షణ కొనసాగనుంది. అందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. జూనియర్ కళాశాలల్లోని తరగతి గదులు, ల్యాబ్‌లు, స్టాఫ్‌గది, ప్రిన్సిపాల్ గది, వరండా కళాశాల ప్రాంగణంలో సీసీ కెమెరలు బిగించారు. ఒక్కో కళాశాలలో 14 నుంచి 16 వరకు, అవసరమైన చోట 20వరకు సీసీ కెమెరాలు అమర్చారు. దీంతో ఇక జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సీసీ కెమెరాల నిఘా పర్యవేక్షణ నిరంతరం కొనసాగనుంది. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 11ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇప్పటికే జిల్లాలో సీసీ కెమెరాల బిగింపు ప్రక్రియ పూర్తి కావచ్చింది.

హాజరు శాతం పెంచేందుకు..

గతంలో ప్రభుత్వ కళాశాలలకు విద్యార్థులు తమ ఇష్టానుసారంగా వచ్చి వెళ్లిపోయేవారు. దీంతో హాజరు శాతం తక్కువగా ఉండడంతో పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉండేది. ఈ క్రమంలో సరైన విద్యాబోధన, పరీక్షల ఫలితాలు మెరుగుపడేలా ఉన్నతాధికారులు ఇంటర్‌లో పలు సంస్కరణలు తీసుకొస్తున్నారు. అందులో బాగంగా తాజాగా సీసీ కెమెరాల ఏర్పాటుతో విద్యార్థుల హాజరు శాతం పెరిగే అవకాశం ఉంది. ఇక నుంచి అధ్యాపకులు కూడా సక్రమంగా విద్యాబోధన చేయాల్సి ఉంటుంది. ఒక సబ్జెక్టు అధ్యాపకుడు ఒక రోజు రాకుంటే ఆ పీరియడ్‌లో వేరే అధ్యాపకుడు బోధించాల్సి ఉంటుంది.

గతంలో పరీక్షల సమయంలో..

గతంలో కేవలం ఇంటర్మీడియెట్ పరీక్షల సమయంలో మాత్రమే పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు కొన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేవారు. ఆ తరువాత వాటిని తీసేసేవారు. ఈ విద్యా సంవత్సరం 2025-26నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రదానంగా విద్యార్థుల హాజరు, అధ్యాపకుల విద్యాబోధనపై నిరంతర పర్యవేక్షణ కొనసాగనుంది. ప్రతీ తరగతి గదిలో నిఘా ఉంటుంది. అకడామిక్ మానిటరింగ్ కమిటీలు, డీఐఈవోలతో పాటు హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డులో కమాండ్ కంట్రోల్ ద్వారా సంబంధిత అధికారులు పర్యవేక్షించనున్నారు. ప్రతీ కళాశాలల్లో అధ్యాపకులు విద్యార్థులకు సరైన రీతిలో పాఠాలు బోధిస్తున్నారా లేదా అన్నది కూడా ఇట్టే తెలిసి పోతుంది. గతంలో కళాశాలలకు వచ్చే అధ్యాపకులు కొన్నిచోట్ల కార్యాలయాలకే పరిమితమవుతున్నారన్న ఆరోపణలు కూడా వినిపించాయి. అదే విధంగా ప్రతి అధ్యాపకుడు క్రమం తప్పకుండా విధులకు హాజరు కావడమే కాకుండా పాఠాలు కూడా సక్రమంగా బోధించేందుకు ఉపయోగపడుతుందని పలువురు విద్యా నిపుణులు తెలుపుతున్నారు.

ఈ నెల 15 నుంచి..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ నెల 15 నుంచి ఫిజిక్స్‌వాలా ద్వారా సంబంధిత వెబ్‌సెట్ ద్వారా జేఈఈ, ఐఐటీ, ఎప్‌సెట్, నీట్‌లాంటి ఎంట్రన్స్ పరీక్షల కోసం ఇంటర్ విద్యార్థులకు శిక్షణ ప్రక్రియ ప్రారంభమైంది. అందుకోసం ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ఫిజిక్స్‌వాలా శిక్షణకు సంబంధించిన టైం టేబుల్‌ను డీఐఈవోల ద్వారా ఆయా జిల్లాల కళాశాలల ప్రిన్సిపాళ్లకు అందించారు. ప్రతిరోజూ ఏదో ఒక సబ్జెక్టుపై శిక్షణ ఇవ్వాలి. ప్రస్తుతం వివిద కళాశాలల్లో ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్ల ద్వారా శిక్షణ ఇస్తున్నారు. ప్రతీ కళాశాలకు ఇన్‌ప్లాంట్స్ టేబుల్స్ కూడా రానున్నాయి. పెద్ద కంప్యూటర్ మానిటర్‌లో వెబ్‌సెట్ ద్వారా వీడియోలను విద్యార్థులు తిలకించనున్నారు. ఫిజిక్స్‌వాలా శిక్షణను విద్యార్థులు సరిగా వినియోగించుకుంటున్నారా లేదా అనేది హైదరాబాద్ నుంచి సంబంధిత అధికారులు కమాండ్ కంట్రోల్ ద్వారా పర్యవేక్షిస్తారు. ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ ద్వారా పర్యవేక్షణకు ప్రతీ జిల్లాకు ఒకరి చొప్పున ఇన్‌చార్జీలను నియమించినట్టు తెలుస్తోంది. అలాగే డీఐఈవోలు కూడా పర్యవేక్షిస్తారు. అందుకు డీఐఈవో కార్యాలయాల్లో కూడా సీసీ కెమెరాలకు సంబంధించిన డ్యాష్ బోర్డును ఏర్పాటు చేయబోతున్నారు. ఒకవేళ సీసీ కెమెరాల్లో టెక్నికల్ సమస్యలు వస్తే వెంటనే పరిష్కరించేలా టెక్నిషియన్‌ను కూడా నియమించారు. దీంతో ఇక కళాశాలల్లో ఏం జరిగినా సమాచారమంతా కమాండ్ కంట్రోల్‌కు తెలిసిపోతుంది.

నిరంతర పర్యవేక్షణ..

- కళ్యాణి, డీఐఈవో, ఆసిఫాబాద్



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సీసీ కెమెరాల నిఘాతో నిరంతర పర్యవేక్షణతో పారదర్శకత పెరగనుంది. అధ్యాపకుల బోధన, విద్యార్థుల హాజరుపై పర్యవేక్షణ ఉండడంతో విద్యాబోధన మెరుగుపడనుంది. విద్యార్థుల హాజరు శాతం పెరగడంతో పాటు అధ్యాపకుల విద్యాబోధనతో మెరుగైె ఫలితాలు సాధించే అవకాశం ఉంది. జిల్లాల్లో డీఐఈవోలతో పాటు హైదరాబాద్ నుంచి కూడా నిఘా ఉంటుంది. ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు సూచనలు చేస్తారు.

ముందస్తు చర్యలు చేపట్టాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

ఆసిఫాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) అన్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర పంచాయతీ రాజ్ కార్యదర్శి శ్రీధర్, కమిషనర్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి శుక్రవారంవీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల అదనపు కల్కెటర్‌లు, గ్రామీణాభివృద్ధి శాఖాధికారులు, మిషన్ భగీరథ, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణమే ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు, మురుగు కాలువ శుభ్రత, రహదారులపై మురికి నీరు నిలువల తొలగింపు, దోమల వృద్ధిని నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. తెగిన రహదారులు, కల్వర్టులకు వెంటనే మరమ్మతులు చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని చెప్పారు. రాబోయే రెండు నెలలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని వీసీ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, పంచాయతీ అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చింతలమానేపల్లి మండలంలో రహదా రులు తెగిపోగా రూ.20 లక్షల వ్యయంతో సత్వరమే మరమ్మతులు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, పంచాయతీ రాజ్ ఈఈ కృష్ణ, మిషన్ భగీరథ ఈఈ సిద్ధిఖి తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

సిర్పూర్(టి), జూలై 25 (ఆంధ్రజ్యోతి): వసతి గృహాల విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. మడల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు నాణ్యమైన బోజనం అందించాలని, వంట గదులను శుభ్రంగా ఉంచుకోవాలని, రక్షిత నీటిని అందించాలన్నారు. డాక్టర్ నవత ఆధ్వర్యంలో హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య, లాల్‌సింగ్, ఏఎన్ఎంలు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

లింగాపూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని డాక్టర్ వనిత అన్నారు. మండలంలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ప్రతీ శుక్రవారం గ్రామాల్లో డ్రైడే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

కొలాం ఆశ్రమ పాఠశాల తనిఖీ

వాంకిడి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): చౌపన్‌గూడ కొలం ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్లు, స్నానప గదులు, వంటశాల, కూరగాయలు స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట ఏటీడీవో చిరంజీవి, ప్రధానోపాధ్యాయుడు మనోహర్ ఉన్నారు.

గ్రంథాలయం ఏర్పాటు చేయాలి

కెరమెరి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి పాఠశాలలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు ఒక పీరియడ్ కే టాయించాలని ఎంఈవో ప్రకాష్ అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎంఈవో అధ్యక్షతన కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. గంథాలయంలో పుస్తకాలను క్రమ పద్ధతిలో ఉపయోగించు కోవడంపై చర్చించారు.

బదిలీపై వెళ్తున్న సీఐకి సన్మానం

కౌటాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బదిలీపై వెళ్తున్న సీఐ ముత్యం రమేశ్‌ను శుక్రవారం జన భవిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో యోగా గురుకులు, యోగా సాధనకులు, ట్రస్ట్ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

ఇరుకు రోడ్డు.. రాకపోకలకు ఇబ్బందులు


రోడ్డు పక్కన దిగబడిన లారీ

లింగాపూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో పుల్ సింగ్‌తండాకు వెళ్లే రోడ్డుపై లారీ శుక్రవారం అదుపు తప్పి దిగ బడింది. మండల కేంద్రం నుంచి లొద్దిగూడ, పుల్‌సింగ్‌నాయక్ తండా, రాహపూర్ గ్రామాలకు వెళ్లే రోడ్డు ఇరుకుగా ఉండడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

పాఠశాల తనిఖీ

కాగజ్‌నగర్‌టౌన్ జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలగల మైనారిటీ గురుకుల పాఠశాల-1ను శుక్రవారం ఎంపీడీవో కోట ప్రసాద్ తనిఖీ చేశారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ రూమి ప్రతిభ, ఏపీవో చంద్రశేఖర్, కార్యదర్శి హరీశ్ ఉన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

ఆసిఫాబాద్/చింతలమానేపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. చింతలమానేపల్లి, బెజ్జూరు, పెంచికల్‌పేట, దహెగాం మండలాల్లో ముసురువాన కురుస్తోంది, జిల్లాలో అత్యధికంగా కౌటాల మండలంలో 5.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సిర్పూ ర్(టి) మండలం లోనవెల్లిలో 4.0, రెబ్బెన మండలం వంకులంలో 3.8, చింతలమానేపల్లి మండలం రవీంద్రనగర్, బెజ్జూరు మండలాల్లో 3.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చింతలమానేపల్లి మండ లంలో శుక్రవారం ముసుర వాన కురిసింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద ఉధృతి పెరిగి దిందా గ్రామా నికి రాకపోకలు నిలిచిపోయాయి. శివపల్లి గ్రామస్థులు సైతం ఒర్రె ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. బాబాసాగర్‌లోని నాయకపుగూడ వాగులో నుంచి అష్ట కష్టాల మీద ప్రజలు పనులు చేసుకునేందుకు అతి కష్టంపై దాటాల్సిన పరిస్థితి నెలకొంది. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పత్తి పంట సైతం నీట మునిగింది. కర్జెల్లి గ్రామానికి చెందిన బాయక్క ఇల్లు రాత్రి సమయంలో వర్షానికి కూలి పోయింది. ఇల్లు కూలిన సమయంలో ఎవరు లేక పోవడంతో ప్రమాదం తప్పింది.


చింతలమానేపల్లిలో పంట చేనులో నిలిచిన వరదనీరు


నిండుకుండలా మారిన పీపీరావు ప్రాజెక్టు

ఉధృతంగా ప్రాణహిత


తుమ్మిడిహెట్టిలో పుష్కరఘాట్ వరకు చేరిన నీరు

కౌటాల, (ఆంధ్రజ్యోతి): మండల సరిహద్దులో ప్రవహిస్తున్న ప్రాణహితకు వరద ఉధృతి పెరుగుతోంది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు తుమ్మిడిహెట్టి సరిహద్దులోని పుష్కరఘాట్ వరకు నీటి మట్టం చేరు కుంది. ప్రాణ హితనదిలో నాటు పడవల ద్వారా దాటే ప్రయత్నం చేయవద్దని, చేపల వేటకు వెళ్లకూడదని అధికారులు సూచిస్తున్నారు.

నిండిన పీపీరావు ప్రాజెక్టు

దహెగాం, (ఆంధ్రజ్యోతి): మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా కల్వాడ శివారులోని పాల్వాయి పురుషోత్తరావు ప్రాజెక్టులో భారీగా వరద నీరు చేరి నిండుకుండలా మారింది. వారం క్రితం వరకు భారీ వర్షాలు లేక పోవడంతో ప్రాజెక్టు నీరు లేక ఎండిపోయింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద నీరుచేరడంతో పూర్తి స్థాయిలో నిండింది.

నిలిచిన రాకపోకలు

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని డోర్‌పల్లి గ్రామానికి వెళ్లే రహదారిపై లో లెవల్ వంతెనపై నుంచి వరద నీరు ఉప్పొంగి ప్రవహిస్తుంది. దీంతో ఇరువైపులా రాక పోకలు నిలిచిపోయాయి.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏఎస్పీ చిత్తరంజన్

జైనూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మోసాల బారిన పడకుండా మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. స్థానిక మార్కెట్ కమిటీ యార్డులో పోలీసులు, ఐకేపీ, ఎంపీడీవో సిబ్బంది ఆధ్వర్యంలో ప్రజ్వల ఫౌండేషన్ సహకారంతో మహిళలకు మానవ అక్రమ రవాణా నివారణపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ చిత్తరంజన్ మాట్లాడుతూ ముఖ్యంగా మహిళలు సామా జిక మాధ్యమాలపై జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ప్రేమ, ఉద్యోగాల పేరట మహిళలు ఈ మధ్య కాలంలో ఎక్కువగా మోసపోయిన ఘటనలు వెలుగు చూశాయని అన్నారు. తల్లిదండ్రులు, గురువులు చెప్పిన మార్గాన్ని అనుసరిస్తు ముందుకు సాగాలని సూచించారు. మహిళలకు ఎవైన అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే తక్షణమే 100 నంబర్‌కు ఫోన్ చేయాలని అన్నారు. రాజ్యాంగం ప్రకారం మనుషుల అక్రమ రవాణ చేయడం చట్టరీత్యా నేరమని అన్నారు. అనంతరం విద్యార్థులు, మహిళలు ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి కుమరంభీం చౌక్‌లో మానవ హారం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన కుడిమెత విశ్వనాథ్, జైనూర్ సీఐ వెల్పుల రమేష్, ఎస్సైలు రవికుమార్, రామకృష్ణ, గంగన్న, సీడీపీవో ఇందిర, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, తహసీల్దార్ ఆడ బీర్షావ్, డీపీఎం యాదగిరి, ఎంపీవో మోహన్, ప్రజ్వల పౌండేషన్ ప్రతినిధులు అహ్మద్ అలీ, చంద్రయ్య, సీరాజ్, సురేష్, మాజీ వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విచారణకు సిద్ధం

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా కొంత మంది వ్యక్తులు కావాలని తనపై బురద జల్లే ప్రయత్నంలో భాగంగా చేస్తున్న ఆరోపణలపై విచారణకు తాను సిద్ధంగా ఉన్నానని వాంకిడి మాజీ సర్పంచ్ తుకారాం అన్నారు. టీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ జడ్పీటీటీ అజయ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ ప్రవీణ్‌తో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గతంలో ఎంపీపీగా పని చేసిన వారి కుటుంబ సభ్యులు కావాలనే తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తనను ఢీకొట్టే దమ్ము లేక ఇటువంటి కుట్రలు పన్నుతున్నాని చెప్పారు. వీటిని తిప్పి కొడుతామని తెలిపారు.

ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జైనూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని తుడుం దెబ్బ నూతన కార్యవర్గం డిమాండ్ చేసింది. ఈ మేరకు వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ఆడ బీర్షావ్‌కు శుక్రవారం అందజేశారు. జీవో 49ను పూర్తి స్థాయిలో రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ నెల 28న నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో మేధావులు, వివిధ సంఘాలు, విద్యావంతులు, ఉద్యోగ సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షులు మధు రాజ్, ప్రధాన కార్యదర్శి ఆత్రం అర్జున్, కుంరం దిలీప్ కుమార్, ప్రచార కార్యదర్శి గోడాం నగేష్, కోశాధికారి మేస్రాం దత్తు, సోషల్ మిడియా కన్వీనర్ జుగునాక ధర్మేందర్, కుంర విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలు

కాగజ్‌నగర్ టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఎంఆర్సీలోని భవిత కేంద్రంలో దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలు అందించామని ఎంఈవో వాసాల ప్రభాకర్ అన్నారు. డాక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహిస్తున్న ఫిజియోథెరపి సేవలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గురు, శుక్రవారాల్లో సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. 18 ఏళ్లలోపు దివ్యాంగులు సేవలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, భవిత కేంద్రం కోఆర్డినేటర్లు సతీష్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలను మోసం చేయడమే లక్ష్యమా

డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమరం మాంతయ్య

కౌటాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అమాయకులైన ఆదివాసీలను మోసం చేయడమే కాంగ్రెస్ లక్ష్యమా అని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమరం మాంతయ్య అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జీవో 49పై అమాయకురాలైన ఎమ్మెల్యే కోవ లక్ష్మిని బదనా చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలోనే జీవో 49కి పునాది పడిందన్నారు. ఆదివాసీలంతా ఏకమై జీవో 49పై పోరాడితే అప్పుడు కళ్లు తెరిచిన కాంగ్రెస్ నాయకులు తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారని అన్నారు. జీవో 49ను పూర్తిగా రద్దు చేయక పోతే ఆదివాసీల తడాఖా చూడాల్సి వస్తుందని తెలిపారు. సమావేశంలో నాయకులు బ్రహ్మయ్య, బాపు, రాజు, నానయ్య తదితరులు పాల్గొన్నారు.